## క్లుప్తంగా

### స్కూల్ బ్యాగుల పంపిణీ



బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**మంచాల:** మండలంలోని తిప్పాయిగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జ్ఞాపకార్థం మంగళవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. గ్రామంతో పాటు చిత్తాపూర్‌లో కూడా మల్లు స్వరాజ్యం ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యాదయ్య, నాయకులు జంగయ్య, యాదయ్య, సుధాకర్, మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రుణమాఫీ పూర్తిగా చేయాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

**మంచాల:** ప్రభుత్వం రుణమాఫీ పూర్తిస్థాయిలో చేసి రైతాంగానికి అండగా నిలవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కేవలం 2018 వరకు మాత్రమే రుణమాఫీ చేయడం వల్ల ఉపయోగం లేదన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, నాయకులు జగన్, సుధాకర్, రామాచారి, యాదయ్య పాల్గొన్నారు.

### జైపాల్‌యాదవ్‌ను కలిసిన నాయకులు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రజాప్రతినిధులు

**కడ్తాల్:** కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను ప్రకటించడంతో, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా, ప్రజల అభిమానం చూరగొన్న నాయకుడు జైపాల్‌యాదవ్ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరం కలిసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, సర్పంచ్ యాదిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్ ఉన్నారు.

### ఆర్థిక సాయం

**కడ్తాల్:** మండలంలోని ముద్విన్ గ్రామంలో అనారోగ్య సమస్యలతో యాదయ్య, పెద్దయ్యలు మృతి చెందారు. మృతుల కుటుంబాలను మంగళవారం జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేల చొప్పున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ యాదయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్య, నాయకులు మహేందర్, జంగయ్య, రాఘవరెడ్డి, శ్రీను ఉన్నారు.

# 'గృహలక్ష్మి' ఎవరికో?



ఇంటింటి సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్

- అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు
- మండలంలో సర్వే పూర్తి!

**మంచాల:** సొంతింటి కల నెరవేరనుందని 'గృహలక్ష్మి' పథకంపై పేద ప్రజలు గంపెడు ఆశతో ఉన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో మొదటిసారిగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లను ఇవ్వనుంది. ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజలు 'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకున్నారు. మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో 2740 మంది గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఆరుట్లలో అధికంగా 345 మంది దరఖాస్తు చేసుకోగా, అతి తక్కువగా కొర్రంతండాలో 42 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

**ఇంటింటి సర్వే....**

గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి దరఖాస్తులు పరిశీలన సర్వే పూర్తి చేశారు. కుటుంబ సభ్యుల వివరాలు, వృత్తి, ఆర్థిక స్థితిగతులపై ఆరా తీశారు. ఇంటి నిర్మాణానికి స్థలం ఉందా, స్థానికంగా ఉంటారా, కుటుంబసభ్యుల్లో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారా వంటి వివరాలను తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన సర్వే పూర్తి చేశారు. ఇక ఆన్‌లైన్‌లో సర్వే వివరాలు పొందుపర్చడం జరుగుతుందని వివరించారు.

**అదృష్టం ఎవరికో?**

గృహలక్ష్మి పథకం కింద నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకం కింద ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు 50శాతం, ఇతరులకు 20 శాతం, వికలాంగులకు 5శాతం చొప్పున ప్రభుత్వం ఇవ్వనుంది. గ్రామాల్లోనే దరఖాస్తులు పెద్ద మొత్తంలో వచ్చాయి. ఆర్‌సీ స్థాయిలో ఇళ్లు ఉన్న వారు, 59 జీఓ కింద లబ్ధిపొందిన వారిని అనర్హులుగా పేర్కొంటుంది. ఇల్లు కట్టుకోవడానికి ఖాళీ స్థలం ఉండి శిథిలావ్యవస్థలో ఉన్న పెంకుటింట్లో ఉన్నవారు, మట్టి గోడలతో నిర్మాణం చేసిన ఇంట్లో రెండేసి కుటుంబాలు నివాసం ఉండి ఇబ్బందులు పడుతున్నా వారిని అర్హులుగా పేర్కొంటున్నారు. ఎన్నికల వేళ గృహలక్ష్మి పథకం ఎంతమందికి వస్తుందో వేచి చూడవల్సిందే.

**అర్హులందరికీ న్యాయం**



గ్రామాల్లో గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులందరికి ప్రభుత్వం న్యాయం చేయాలి. గ్రామాల్లో చాలా మంది నిరు పేదలు ఇళ్లు కట్టుకునే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న, చిన్న గదుల్లో, ఇరుకు ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇళ్ల మంజూరు విషయంలో కటాఫ్ లేకుండా అర్హులందరికీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– పొందాల జంగయ్యగౌడ్, (ఉప సర్పంచ్)ఆరుట్ల

**ప్రభుత్వ నిబంధనల ప్రకారం**



గృహలక్ష్మి పథకం అమలులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తున్నాం.. ప్రస్తుతం ఇంటింటి సర్వే పూర్తి చేశాం.. అర్హుల జాబితాను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపి, ఆన్‌లైన్‌లో వివరాలను పొందుపర్చుతున్నాం.

– చిలుకూరి శ్రీనివాస్(ఎంపీడీఓ) మంచాల

# ఉన్నత లక్ష్యంతో చదవాలి

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి

**యాచారం:** విద్యార్థులకు పాఠశాల స్థాయి ఎంతో విలువైందని, ఉన్నత లక్ష్యంతో చదివి గొప్పవ్యక్తులు కావాలని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి అన్నారు. వంశీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలకు 100 బెంచీలు, యాచారంలోని చిరువ్యాపారులకు 28 తోపుడు బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారే గొప్ప వ్యక్తులయ్యారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. పాలకులు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి కృషి చేయాలని సూచించారు. విద్యపై ఎంత ఖర్చు పెడితే దేశాభివృద్ధి అంతే వేగంగా ముందుకు వెళ్తుందని చెప్పారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని చిరువ్యాపారులు ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో యాచారం ఎంపీపీ సుకన్య, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, బీజేపీ రాష్ట్ర నాయకులు పోరెడ్డి నర్సింహారెడ్డి, లచ్చిరెడ్డి, అంజయ్య యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు యాదయ్య, జంగయ్య, రమేష్, విజయ్‌కుమార్, శ్రీధర్‌గౌడ్, రమేష్, నరేష్, నాగరాజు, గణేష్ నాయక్, శ్రీనాథ్, దయాకర్ పాల్గొన్నారు.



పాఠశాలకు బెంచీలను అందజేసిన మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి

# మండలం ప్రకటించే వరకు దీక్షలు

వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

**తలకొండపల్లి:** గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం దీక్షా శిబిరాన్ని శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి మాట్లాడారు. మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు అన్ని ఉన్నాయని, అభివృద్ధి పరంగా గట్టుఇప్పలపల్లి అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నా మండలం ఎందుకు ఏర్పాటు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 41 రోజులు దీక్షలు చేశారని, ప్రస్తుతం దీక్షలు చేపట్టి 51 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి మండలం ఏర్పాటు చేసే వరకు దీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, కృష్ణయ్య, దమోదర్, అశోక్, రాజు ,శివయ్య, కిషన్, మహేష్, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, గౌడసంఘం తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, పవన్‌వాల్మీకి, కృష్ణయ్య, రేణురెడ్డి, శ్రీను, మల్లయ్య, కొండల్ పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కడ్తాల్: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కడ్తాల్:** మండలంలోని కాన్గుబావితండాకు చెందిన వినోద్‌కు రూ.1.50 లక్షలు, మైసిగండికి చెందిన కిషన్‌కు రూ.28 వేలు, కడ్తాల్‌కు చెందిన నర్సమ్మకు రూ.16 వేలు, చరికొండకు చెందిన జ్యోతికి రూ.60 వేలు, గానుగుమార్లతండాకు చెందిన జ్యోతికి రూ.20 వేలు, మక్తమాధారంకు చెందిన శ్రీకాంత్‌కు రూ.22 వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరాం, హంశ్యామోత్యానాయక్, నాయకులు లాయఖ్అలీ, హర్యానాయక్, కృష్ణ ఉన్నారు.

**సీఎం సహాయనిధి చెక్కు అందజేత**

**అబ్దుల్లాపూర్‌మెట్:** అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన గీతాబాయి కూతురుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వైద్య ఖర్చుల నిమిత్తం వచ్చిన రూ.60 వేల చెక్కును మంగళవారం గ్రామ సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్ స్థానిక నాయకులతో కలిసి గీతాబాయ్‌కి అందజేశారు.

# ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

**తలకొండపల్లి:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని నిరుపేదలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రముఖ రియలిస్టు ఎమిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఎమిరెడ్డి మాధవరెడ్డి, భారతమ్మల దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి , ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని సర్పంచ్ కిష్టమ్మతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణా ప్రాంతాల్లోనే ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ శిబిరంలో 612 మందికి దీర్ఘకాలిక, సాధారణ వ్యాధులతో పాటు, దంత, కీళ్ల నొప్పులు, ఆర్థో, కంటి, తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, మురళీధర్, హరికాంత్, కల్కిదోనగుట్ట ఆలయ కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి, కంటి వైద్యులు చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం

- వాడీవేడిగా మండల సభ
- మొక్కజొన్న పంటకు నష్ట పరిహారం ఇవ్వాలి
- మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సభలో ఏఈని నిలదీస్తున్న సర్పంచ్ కుమార్, తదితరులు

**తలకొండపల్లి:** విద్యుత్ అధికారుల తీరుపై పలువురు సర్పంచ్‌లు మండిపడ్డారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిర్మణి నిర్మల అధ్యక్షతన మండల సర్వసభ్యం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ వెంకటేశ్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డిలు హాజరయ్యారు. విద్యుత్ ఏఈ కటారియా ఎజెండా చదువుతుండగా చంద్రధన సర్పంచ్ కుమార్ అడ్డు తగిలారు. అనుమతి లేకుండా అక్రమ విద్యుత్‌ను వాడుతున్నారని తనపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేసి రూ.72,250 ఫైన్ వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కేసు ఎలా నమోదు చేస్తారని నిలదీశారు. విద్యుత్ వినియోగంలో అవకతవకలు జరిగినట్లు రుజువైతే పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు చేయాలి. లేదా కార్యదర్శి అందుబాటులో లేకుంటే ఎంపీడీఓ, ఎంపీఓలపై కేసులు నమోదు చేయాలి కానీ నాపై కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ఆరోపించారు. దీంతో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కలుగజేసుకొని విద్యుత్ సీఎండీతో ఫోన్‌లో మాట్లాడి ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయరాదని, కేసులను రద్దు చేయాలన్నారు. అలాగే, వ్యవసాయానికి నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని, కనీసం ప్రతిరోజు 8గంటల పాటు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎండిన మొక్కజొన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారాన్ని అందజేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా రూ. కోటి 92 లక్షల పంట రుణమాఫీ జరగాల్సి ఉండగా, కేవలం రూ. 20 లక్షలు మాత్రమేనని కేశవరెడ్డి సభకు తెలిపారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. తలకొండపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి సహకరిస్తే జిల్లాలోనే అగ్రగామిగా నిలబెడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేష్, జెడ్పీ కో ఆప్షన్ ఎండీ ముజీబర్ రహేమన్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, ఏఓ రాజు, డాక్టర్లు, ఏఈలు, ఎంఈఓ సర్దార్‌నాయక్ పాల్గొన్నారు.

### 'పట్నం' నుంచి పోటీకి సిద్ధం



మహిళలతో ర్యాలీగా తరలిన రాంరెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఇబ్రహీంపట్నం నుంచి పోటీ చేసేందుకు తాను సిద్ధమని పేర్కొంటూ పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు, పెద్దఅంబర్‌పేటకు చెందిన దండెం రాంరెడ్డి ముందుకు వచ్చాడు. ఈ మేరకు మంగళవారం వందలాది మంది కార్యకర్తలు, మహిళలతో కలిసి భారీ ర్యాలీగా పెద్దఅంబర్‌పేట నుంచి గాంధీభవన్‌కు తరలి వెళ్లి బయోడేటా ఫారం అందజేశారు. అంతకు ముందు గ్రామంలోని బోనమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అంధుల ఆశ్రమానికి చేయూత



ఆశ్రమానికి నిత్యావసర సరుకుల అందజేత

**ఇబ్రహీంపట్నం:** వినోబానగర్‌లోని స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్ అంధుల ఆశ్రమానికి ఏఆర్ 3వ బెటాలియన్ పోలీస్ సిబ్బంది చేయూత నందించారు. నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, పండ్లను మంగళవారం నిర్వాహకులు రాజు, జ్యోతి సమక్షంలో ఆశ్రమానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్లు ఎంఏ సురేష్, టి.గంగారాం, ఆర్ఎస్‌పీలు ఎస్‌డీ రఫీ, రంగారెడ్డి, ఏఆర్ఎస్ఆర్‌లు ఎండీ సిరాజొద్దీన్, నర్సింహ్మారెడ్డి, హెచ్‌సీలు సంపత్‌రెడ్డి, పీసీ ప్రసాద్, హెచ్‌సీ సైదులుతోపాటు ధన్‌రాజ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

**కడ్తాల్:** సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక వ్యాపార సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వ్యాపారులు ముందుకు వచ్చారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, క్లాత్ మర్చంట్స్ మేన్స్‌వేర్ నిర్వాహకులు రూ.30 వేలు, చికెన్ సెంటర్ నిర్వాహకులు రూ.17 వేలు విరాళం ఎస్ఐ హరిశంకర్‌గౌడ్‌కు అందజేశారు.

# గొల్లకురుమల సమస్యలు పరిష్కరించండి

సంఘం రాష్ట్ర కార్యదర్శి రవీందర్



ఐక్యతను చాటుతున్న సంఘం నాయకులు

**కడ్తాల్:** గొర్రెల,మేకల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం( జీఎంపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఉడుతల రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కేపీఎం ఫంక్షన్ హాల్‌లో గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం అవగాహన సమావేశం, నూతన మండల కమిటీ ఎన్నిక ఎన్నుకున్నారు. మండల కేంద్రానికి చెందిన క్యామ చంద్రశేఖర్ జీఎంపీఎస్ అధ్యక్షుడిగా, మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన గొల్లకురుమలందరికీ గొర్రెలను అందజేసి కోటీశ్వరులను చేస్తామని, గొల్ల కురుమల ఓట్లను వేయించుకుని, రెండోసారి అధికారంలోకి వచ్చి, గొల్ల కురుమలను మోసం చేసిందని విమర్శించారు. మొదటి విడుత ఇచ్చిన గొర్రెల పంపిణీలో అనేక అవకతవకలు, అవినీతి అక్రమాలు చోటు చేసుకోవడంతో, గొల్లకురుమలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రెండో విడుత గొర్రెల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, నేటికి గొర్రెలు పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తోందని, వెంటనే ప్రభుత్వం నగదు బదిలీతో రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నగదు బదిలీతో గొర్రెల పంపిణీ చేపట్టాలని, జీవాల మేతకు ఉపయోగపడే 1016, 559 జీఓలను సక్రమంగా అమలు చేయాలన్నారు. గొర్రెల మేకల పెంపకం దారుల సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో, వచ్చే ఎన్నికల్లో గొల్ల కురుమల సత్తా చూపిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జీఎంపీఎస్ నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైన క్యామ చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు గౌర శ్రీశైలం, జిల్లా కార్యదర్శి మల్లేష్, పెంటయ్య, ఉప సర్పంచ్ రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఉపాధ్యక్షుడు యాదయ్య, జిల్లా నాయకులు సత్యనారాయణ, రమేశ్, చేగూరి వెంకటేశ్, కృష్ణ, పారేశ్, మల్లేశ్, మండల కమిటీలో ఎన్నికైన సభ్యులు తదితరులు ఉన్నారు.

# కల్వకుర్తి కాంగ్రెస్ టికెట్‌కు సుంకిరెడ్డి దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న రాఘవేందర్‌రెడ్డి

**ఆమనగల్లు:** కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. 2018 నుంచి కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేశానని అమెరికాలోని డల్లాస్ నగరంలో తెలంగాణ వాసులతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలిసి పని చేశానని ఆయన తన దరఖాస్తులో వివరించారు. గత మూడు నెలల నుంచి కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నానని ఆయన చెప్పారు. గత ఏడాదికాలంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. కల్వకుర్తి కాంగ్రెస్ టికెట్ తనకు ఇవ్వాలని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు.

# శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

**ఇబ్రహీంపట్నం:** బీఆర్ఎస్ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి.. సీఎం కేసీఆర్ మరోసారి అవకాశం కల్పించడంపై శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు క్యాంపు కార్యాలయంలో కిషన్‌రెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో ఇబ్రహీంపట్నం పార్టీ అధ్యక్షుడు బుగ్గ రాములు, ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జెర్కొని రాజు, శివరెడ్డి తదితరులు ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

**• ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతి**



**తుర్కయంజాల్:** పురపాలక సంఘంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి రాష్ట్రం నుంచి పని చేస్తున్న తమకు చాలీచాలని వేతనాలతో పని చేస్తూ కుటుంబాలను పోషించుకోలేని దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మేడే సందర్భంగా సీఎం కేసీఆర్ శానిటేషన్ సిబ్బంది, ఇతర సిబ్బందికి కనిష్టంగా రూ.1000 పెంచాలని ఆదేశించినా నేటికి అమలు కాలేదన్నారు. కమిషనర్ వెంటనే స్పందించి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్‌లు శ్రీనివాస్, ప్రశాంత్ , మల్లేష్ పాల్గొన్నారు.

**• 'సర్వ్' సేవలతో ప్రయోజనం**

**కడ్తాల్:** గ్రామీణ ప్రాంత పేదలకు 'సర్వ్ దివ్యాంగుల సేవా సంస్థ' అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ డి.అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్మాస్‌పల్లిలో సర్వ్ సంస్థ (సీబీఆర్ ప్రాజెక్ట్) ఆధ్వర్యంలో, హైదరాబాద్‌లోని కామినేని హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ శంకర్‌తో కలిసి సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో 120 మందికి రక్త పరీక్షలు, జనరల్ వైద్య పరీక్షలు, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. చికిత్స అవసరమైన వారిని కామినేని అస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు మీనాక్షి, సంస్థ సభ్యులు సార, శ్రీనివాస్, ప్రమీళ, సురేష్, క్యాంపు ఇన్‌చార్జి దేవేందర్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**• బాధితులకు అండగా సహకార సంఘం**

**అబ్దుల్లాపూర్‌మెట్ :** సహకార సంఘం పరిధిలోని ప్రతి సంఘ సభ్యుడి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి అన్నారు. తారమతిపేటకు చెందిన సంఘం సభ్యుడు గడ్డం ఇస్తారి జులై 27న మృతి చెందడంతో సహకార సంఘం తరఫున బాధిత కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సహాయం మంగళవారం మృతుడి భార్య వెంకటమ్మకు విఠల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్‌పర్సన్ మల్లమ్మ జంగయ్య యాదవ్, డైరెక్టర్లు లక్ష్మమ్మ, యాదిరెడ్డి, బాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, మేనేజర్ ఐలేష్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

**• నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు చేయూత**

**తలకొండపల్లి:** నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన నారమళ్ల పద్మమ్మ ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టింది. డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణం ఆపేసింది. భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్ ద్వారా విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ వెంకటేష్ మంగళవారం ట్రస్టు సభ్యులచే పద్మమ్మ ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక, కాంక్రీట్, తదితర మెటీరియల్‌ను అందజేశారు.

**• ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు**

**ఇబ్రహీంపట్నం:** ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తికేయ కళాశాలలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.శంకర్ మాట్లాడుతూ.. 1970లో కేరళ రాష్ట్రంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుంచి విద్యారంగంపై నిరంతర పోరాటం చేస్తోందన్నారు. అధ్యయనం, పోరాటం నినాదాలతో ఆవిర్భవించిన ఎస్ఎఫ్ఐ సభ్యత్వాన్ని ప్రతిఒక్కరూ తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తరంగ్, శ్రీకాంత్, వంశీ, వర్షిత్, లక్ష్మణ్, దోని, రాఘవేందర్ పాల్గొన్నారు.